క్లుప్తంగా

ఆలయాల్లో పూజలు


వేంకటేశ్వరస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు చేపట్టారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే కౌతాళంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధికంగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


సిద్ధాపురం ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని జాలిమంచి గ్రామంలో వెలిసిన శ్రీ సిద్ధాపురం ఆంజనేయ స్వామిని శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా ఆదోని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి మాజీ ఎమ్మెల్యే రూ.3.51 లక్షలు తన సొంత నిధులతో గద(మూడు కేజీల వెండితో)ను తయారు చేయించి ఆలయ అర్చకులకు అందించారు. ఆలయంలో స్వామివారికి మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముందుముందు స్వామివారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


నాటుసారా స్థావరంపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆదోని రూరల్: ఆదోనిలోని అఫిసరాళ్ల కొండల్లో శనివారం నాటుసారా స్థావరంపై దాడులు చేసి 260 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. అలాగే 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన బోయ వెంకటేష్‌పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రశాంత్‌నగర్‌కు చెందిన బోయ గుంటెమ్మను అరెస్టు చేసి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

గౌరవప్రదమైనది ఉపాధ్యాయ వృత్తి


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుందని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, శివరాం, దేవకృపమ్మలను ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పూల మాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందిన వారు అందరికీ ఆదర్శంగా నిలిచేలా పనిచేశారని, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, నాగరాజు, ప్రసన్నరాజు, బాబయ్య, యల్లప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఆదోని టౌన్: స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్‌కార్డు లేదా రేషన్‌కార్డు లేదా ఓటర్ గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఆదోని డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీక్ సూచించారు. శనివారం ఆయన స్థానిక డిపోలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన ప్రతి మహిళకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. అయితే తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపుకార్డును వెంట తెచ్చుకోవాలన్నారు. ఒరిజినల్ గుర్తింపు కార్డును చూపిస్తేనే ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. లేనిపక్షంలో ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించబోమన్నారు.

ఉపసంహరించుకోవాలి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం ఇటీవల రూపొందించిన మూల్యాంకన విధానం అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు బోధన సమయాన్ని హరించే విధంగా ఉందని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. గోకారి, టి.కే. జనార్దన్, రాష్ట్ర కార్యదర్శి బి. నాగరాజు రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఎంఆర్సీ కేంద్రం వద్ద ఎస్టీయూ నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు నాగేంద్ర, సుంకన్న, సత్యన్న, భీమరాజు, సుధాకర్ పాల్గొన్నారు.



చిన్న పిల్లల ఆసుపత్రి వద్ద శిథిలమైన మురుగు కాలువ, భీమాస్ సర్కిల్‌లో..


టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మురుగు కాలువ


టూ టౌన్ సమీపంలో కాలువలో నిలిచిన మురుగు నీరు

కాలువలు ఇలా..
మురుగు పారేదెలా?

- పట్టణంలో శిథిలమైన కాలువలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్
- ముందుకు పారని మురుగునీరు
- చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న కాలనీలు

ఆదోని సెంట్రల్: పట్టణంలో దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగు కాలువలు శిథిలమయ్యాయి. దీంతో పాటు కాలువల్లో చెత్తాచెదారంతో పాటు ప్లాస్టిక్ వస్తువులు వంటివి పేరుకుపోవడంతో నీరు ముందుకు వెళ్లడం లేదు. కొద్దిపాటి వర్షాలకే లోతట్టు ప్రాంతాలు మొదలుకొని ప్రధాన రహదారులపైకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలువలను విస్తరణ చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెరిగిన జనాభా..

పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. దాదాపు 2లక్షలకు పైబడి జనాభా ఉంది. పట్టణంలో దాదాపు 160 నుంచి 180 కిలోమీటర్ల మేర మురుగు కాలువలు, 13 నుంచి 15 కిలో మీటర్ల మేర మురుగు వంకలు కూడా ఉన్నాయి. పట్టణంలో దశాబ్దాల క్రితం అప్పటి జనాభా ప్రాతిపదికన కాలువలను నిర్మించారు. క్రమేణా పట్టణ జానాభా పెరిగింది. నీటి వాడకం కూడా ఎక్కువయ్యింది. ఈ అవసరాలకు ప్రస్తుత కాలువలు సరిపోవడంలేదు. పైగా ఉన్న కాలువలు శిథిలమయ్యాయి. ప్రజలు ఇబ్బందులు పడకూడదని ప్రతి ఏటా వర్షాకాలానికి ముందుగా పూడికతీత పనులను చేపట్టే వారు. ప్రస్తుతం ఆ పనులను చేపట్ట లేదు. ప్రధాన రహదారుల్లో ఉన్న మురుగు కాలువలతో పాటు, కాలనీల్లో ఉన్న మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి.

ఆక్రమణలతో కుంచించుకుపోయిన కాలువలు..

కొన్ని చోట్ల అక్కడక్కడ కాలువలు ఆక్రమణలకు గురై కుచించుకొని పోయాయి. మరికొన్ని చోట్ల పూడుకొని పోయాయి. అయా కాలువల్లో ప్లాస్టిక్ వస్తువులతో పాటు చెత్త చెదారం నిల్వ ఏర్పడడంతో నీరు ముందుకు వెళ్లడం లేదు. వర్షపు నీటితో పాటు మురుగు నీరు రోడ్ల మీదకు వచ్చి చేరుతున్నాయి. వివిధ పనుల మీద తిరిగే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాలువలను విస్తరింప చేసి వాటిని నిర్మించాల్సిన అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు ప్రతి ఏటా నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారే తప్ప మురుగు నీరు రోడ్ల మీదకు, కాలనీల్లోకి రాకుండా శాశ్వత పరిష్కారం చూపడం లేదనే పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘానికి పన్నుల రూపంలో రూ. లక్షల్లో అదాయం సమకూరుతున్నా ప్రజలకు అవసరమైన కనీస వసతులను సమకూర్చడంలో అటు అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమతున్నారని ఆరోపిస్తున్నారు.

ఎవరికి వారే మరమ్మతులు

పట్టణంలో మురుగు కాలువలను ఎవరికి వారే మరమ్మతులను చేసుకోవాల్సిన పరిస్థితి. ప్రధాన రహదారి పక్కన షాపు ఉంటే షాపు యాజమాని, ఇల్లు ఉంటే ఇంటి యజమాని తమ పరిధిలోని కాలువలకు మరమ్మతులు చేసుకుంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లో అలానే ఉండి పోతున్నాయి. కనీసం రహదారి ఎత్తును ప్రామాణికంగా తీసుకొని మురుగు కాలువలను ఎత్తును పెంచాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని అయా కాలనీలతో పాటు ప్రధాన రహదారిపైన కూడా మోకాళ్లలోతు వర్షపు నీరు వచ్చి చేరుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి శిథిలమైన మురుగు కాలువలను విస్తరింప చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని పలువురు పేర్కొన్నారు.

కాలువల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం

పట్టణంలో మురుగుకాలువలు శుభ్రం చేయిస్తాం, మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. వచ్చే మున్సిపల్ సమావేశంలో మురుగుకాలువల విషయంపై బడ్జెట్‌లో బిల్లు ప్రవేశపెట్టి, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరైన వెంటనే కాలువల పనులు చేపడతాం.

– కృష్ణ, మున్సిపల్ కమిషనర్

ఆలయ అభివృద్ధికి విరాళం


ఈఓ వాణికి వెండి బిందెలను అందజేస్తున్న చెన్నబసప్ప కుటుంబ సభ్యులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల కోసం శనివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆదోని పట్టణ వాస్తవ్యులైన మేఘనాథ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు (అక్షర శ్రీ స్కూల్) వారు రూ.లక్షను నగదు రూపంలో అందజేశారు. అలాగే ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ చెన్నబసప్పధని వారి కుటుంబ సభ్యులు రూ.1.34లక్షల విలువైన కేజీ రెండు వందల గ్రాముల నాలుగు వెండి బిందెలను ఆలయానికి విరాళంగా ఇచ్చారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి కోరారు. మాజీ ట్రస్టుబోర్డు డైరెక్టర్ కోట్రేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పల్లకోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

కౌతాళం/ కోసిగి: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా చివరి సోమవారం స్వామి వారి పల్లకీ మహోత్సవాన్ని ఘనంగా చేపట్టాడానికి అందరూ సహకరించాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి కోరారు. స్వామి పల్లకీ సేవ, జలాభిషేకం జరుగే కోసిగి మండలం కందుకూరు గ్రామం తుంగభద్ర నది వద్ద ఏర్పాట్లను శనివారం కోసిగి ఎస్‌ఐ, కందుకూరు గ్రామస్తులు, వైదిక కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమాలపై చర్చించారు. వారి వెంట ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు ఈరప్పస్వామి, మహదేవస్వామి, ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ ఉన్నారు.

ఘనంగా కోట్ల జయంతి

ఆదోని టౌన్: పట్టణంలోని కోట్ల సర్కిల్‌లో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి 150వ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదోని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.సాయినాథ్, పట్టణ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్‌దోక, మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖాశింవలి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆసిఫ్, జాకీర్, రఫీక్, రంగన్న, అజయ్, శేఖర్ పాల్గొన్నారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

పెద్దకడబూరు : రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత 25రోజులుగా మండలంలోని 26గ్రామాల ప్రజలు యూరియా అందుబాటులో లేక సొసైటీల చుట్టూ, రైతుసేవా కేంద్రాల చుట్టూ, ఎరువుల దుకాణాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా... ఎక్కడా అందుబాటులో లేక నిరుత్సాహ పడుతున్నారన్నాడు. గత ప్రభుత్వంలో ఏగ్రామంలో చూసినా అక్కడే ఉన్న రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసిందని గుర్తుచేశాడు. ఇప్పుడు చూస్తే అసలు యూరియానే దొరకకుండా పోయిందని ఇది కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు.

కళాశాల రుణం తీర్చుకోవాలి

ఆదోని సెంట్రల్: మనం చదువుకున్న కళాశాల, పాఠశాలల రుణం తీర్చుకోవాలని విశ్రాంత ఏఎస్పీ బైరామ్ పెద్దయ్య అన్నారు. ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ రాజనీతి శాస్త్రంలో అత్యధిక మార్కులను సాధించిన తనుశ్రీకి బంగారు పతకాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ 1967–1972 మధ్య కాలం చదువుకొనే రోజుల్లో బంగారు పతకాన్ని అందుకున్నట్లు గుర్తు చేసుకున్నారు. ఆ స్ఫూర్తితోనే కళాశాలలో చదువుకొని ప్రతిభ చాటిన విద్యార్థికి పతకాన్ని బహూకరిస్తున్నట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణ

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బాల సాహిత్యవేత్త, బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 75వ పుస్తకం 'సీతాకోకచిలుక' ఆవిష్కరణ శనివారం ఆలూరులోని బ్రెయిలీ ఆలయంలో ఘనంగా జరిగింది. జనప్రియ కవి, పద్య కిరీటి ఏలూరు వెంగన్న, విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ యస్. రంగస్వామి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎస్.పి. వీరస్వామి, ప్రపంచ తొలి బ్రెయిలీ భగవద్గీత అనువాద కర్త, గీతావధాని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు బుర్ర తిక్క లక్ష్మన్న తదితరుల చేతుల మీదుగా పుస్తకావిష్కకరణ గావించారు. అనంతరం ఈ పుస్తకాన్ని క్రిష్టారెడ్డి, కాపిరెడ్డి దంపతులకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో సభ సమన్వయకర్త మహాదేవమ్మ, విశ్రాంత గ్రంథాలయ అధికారి నీరుగంటి వెంకటేశ్వరు పాల్గొన్నారు.

19న వాహనాల వేలం

ఆదోని రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన 11 (మోటార్ సైకిళ్ల) వాహనాలకు ఈనెల 19న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ శనివారం తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో 19న ఉదయం 10 గంటలకు వేలంపాట ప్రారంభమవుతుందన్నారు.


శ్రీమఠం కారిడార్‌లో భక్తుల కోలహాలం

శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం రూరల్ : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం కారిడార్‌లో సందడి నెలకొంది. శనివారం ప్రత్యేక పర్వదినం, గోకులాష్టామి సెలవు దినం కావడంతో భక్తుల కోలహాలం కొనసాగింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాధిగా భక్తులు తరలివచ్చి రాఘవేంద్రులు మూలబృందవాన్ని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనార్థంలో క్యూలైన్లు, పరిమళ ప్రసాదం కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఇండోర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మెయింటినెన్స్ పనులు ఉండడం వల్ల ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ లోకేష్ శనివారం తెలిపారు. పట్టణంలోని ఎస్కేడీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, చిన్న మార్కెట్, ఎంఎం రోడ్డు, మార్కండేయ ఆలయం, కార్వన్‌పేట కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

అర్హతలేని క్లినిక్‌లపై చర్యలు తీసుకోండి

ఆదోని అర్బన్: అర్హతలేని క్లినిక్‌లు, డాక్టర్లతో ప్రజల ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తున్నారని, ఇలాంటి క్లినిక్‌లపై అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ క్రిష్ణమూర్తి, డాక్టర్ పద్మకుమార్, డాక్టర్ గంగాధర్‌రావు, డాక్టర్ ఆదిత్యకుమార్ కోరారు. శనివారం స్థానిక ఓ నర్సింగ్ హోంలో ఐఎంఏ సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. శుక్రవారం బోయగేరికి చెందిన సరోజమ్మ అనే మహిళ నకిలీ వైద్యుడు ఇచ్చిన ఇంజెక్షన్ వల్ల అస్వస్థతకు గురై ఓ నర్సింగ్ హోంలో చేరిందన్నారు. ఈ సందర్భంగా సరోజమ్మ భర్త వీరాంజి మాట్లాడుతూ.. తలనొప్పి ఉందని తన భార్యను తీసుకెళితే డాక్టర్ నూర్ అనే వ్యక్తి ఇంజెక్షన్ వేశాడని, దీంతో పది నిమిషాలకు అస్వస్థతకు గురయ్యిందని చెప్పాడు. వెంటనే నర్సింగ్ హోంకు చేర్పించామని తెలిపారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.సుదర్శన్, వీరేష్, అజయ్‌బాబు, బసాపురం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను పార్టీ పట్టణ కార్యదర్శి రంగన్న, మండల కార్యదర్శి రాజీవ్, గోనెగండ్ల మండల కార్యదర్శి శ్రీరాములు స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బజారి, దాదావలి, కేసీ జబ్బార్, మద్దిలేటినాయుడు, మాలిక్, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.




శ్రీకృష్ణుడు, గోపికలు, ఆంజనేయస్వామి వేషధారణలో చిన్నారులు, కోసిగిలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు, గోనెగండ్లలో ఎద్దుల బండిపై కృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

జయ కృష్ణా... ముకుందా

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- మార్మోగిన హరే కృష్ణ నామస్మరణ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వివిధ వేషధారణలో అలరించిన చిన్నారులు


ఆదోనిలో అశేషజనవాహిని మధ్య రథోత్సవం

ఆదోని అర్బన్: హరే కృష్ణ, హరే రామ హరే హరే అనే నామస్మరణతో పట్టణమంతా మార్మోగింది. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీకృష్ణుడి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, యాదవులు స్వామి వారికి పంచామృతాభిషేకం, తులసీఅర్చన, వెండి, తులసీహారం అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం డోలు, సన్నాయిల మధ్య ఆలయం నుంచి అదే రోడ్డులో వెలిసిన లక్ష్మమ్మవ్వ గుడి వరకు రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం ముందు చిన్నారులు, బాలికలు, బాలురలు కోలాటాలు వేసి అలరించారు. అలాగే శ్రీకృష్ణుడు, ఆంజనేయస్వామి వేషధారణలో బాలికలు, చిన్నారులు అలరించారు. డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని గీతామందిరంలో శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మంత్రాలయం వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణలు గావించి, మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే శ్రీకృష్ణుడికి భక్తుల మధ్య స్వామి వారి ఊంజల సేవా కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో గీతామందిరంలో వెలసిన శ్రీ కృష్ణుడికి శ్రీనివాచార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక రాయల్ స్కూల్‌లో చిన్నారులకు గోపికలు, శ్రీ కృష్ణుడి వేషధారణలో అలరించారు.

ఎమ్మిగనూరులో ఘనంగా వేడుకలు


ఎమ్మిగనూరు గీతామందిర్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక గీతామందిర్‌లో శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు ఉట్టి కొట్టి అలరించారు. అదేవిధంగా ఆలయంలో ప్రధాన అర్చకులు భాస్కరశాస్త్రి, విష్ణువర్ధన శాస్త్రిల ఆధ్వర్యంలో హోమ పూజలు చేశారు. పట్టణంలో శ్రీకృష్ణుడి విగ్రహంతో భక్తుల కోలాటంతో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటసాయి ఆలయ అర్చకులు శ్రీనివాసులు, ఆలయ నిర్వాహక కమిటీ పెద్దలు లక్ష్మన్న, ఉరుకుందప్ప, చెన్నారెడ్డి, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తేరు బజారులో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీకృష్ణుడి చిత్రపటంతో పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు.


పెద్దనేలటూర్‌లో శ్రీకృష్ణుని రథోత్సవంలో హారతులు పట్టుకొని వస్తున్న చిన్నారులు, మహిళలు

కార్యక్రమంలో యాదవ సంఘ తాలూకా అధ్యక్షుడు అవుకు నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఉలినారాయణ, నాయకులు వీరేష్, శ్రీనివాసులు, మాదవ స్వామి తదితరులు పాల్గొన్నారు.

- గోనెగండ్ల : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోనెగండ్ల, పెద్దనేలటూర్, హెచ్ కైరవాడి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ దేవాలయంలో తులసి సహస్రనామార్చన, గోపూజ, తులాభారం, గంగపూజ, పుష్ప, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. పెద్దనేలటూర్ గ్రామంలో రథోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయం నుంచి జమ్మిచెట్టు వరకు రథోత్సవం నిర్వహించి తిరిగి ఆలయం చేరుకున్నారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.